సాక్షి
ఖమ్మం
ఆదివారం ׀ 25 ׀ జూన్ ׀ 2023



విద్యుత్ ఉత్పత్తిలో ఆదర్శం

విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు. 8లో



ఉద్యోగాల పేరుతో టోకరా

జీసీ సంక్షేమ శాఖలో ఉద్యోగాల ఇప్పిస్తానని నమ్మించిన ఓ మహిళ రూ.1.50 కోట్ల మేర వసూలు చేసి కానరాకుండా పోయింది. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తర్లు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

సాగు.. జోరుగా!

ఈ ఏడాది వానాకాలం సీజన్ జోరందుకుంటోంది. వర్షాలు మొదలై భూమి పదును కావడంతో సాగుపై రైతాంగం దృష్టి సారించింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో జిల్లా వ్యాప్తంగా గత రెండు, మూడు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుండగా రైతులు మెట్ట పంటల సాగు చేపట్టారు. ఇప్పటికే కొన్నిచోట్ల దుక్కులు దున్నిన వారు విత్తనాలు విత్తుతున్నారు. ప్రధానంగా పత్తి సాగుకు రైతులు ప్రాధాన్యం ఇస్తూ, మరోపక్క వరి నార్లు కూడా సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఉద్యాన పంటలతో కలిసి 24,534 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

డివిజన్ల వారీగా సాగైన పంటల వివరాలు

డివిజన్	ఎకరాలు
వైరా	10,241
సత్తుపల్లి	8,933
మధిర	4,288
కూసుమంచి	979
ఖమ్మం	93
మొత్తం	24,534

మెట్ట పంటలపై రైతాంగం దృష్టి

- వర్షం పడుతుండడంతో పత్తి విత్తుతున్న రైతులు
- ఇప్పటి వరకు 24,534 ఎకరాల్లో పంటలు
- మరోవైపు విత్తనాల కోసం రైతులు పరుగులు

జల్లులతో సాగుకు సై

రెండు, మూడు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు పంట చేలకు పయనమవుతున్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో అన్ని పంటలు కలిపి 6.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇందులో వరి 2,89,983 ఎకరాలు, పత్తి 2,23,617 ఎకరాలు, మిర్చి 80వేల ఎకరాల వరకు ఉంది. అయితే ప్రస్తుతం పత్తి సాగు ఊపందుకుంది. అలాగే బోర్లు, బావుల కింద వరి నార్లు పోస్తుండగా, జలాశయాల కింద పొడి దుక్కుల్లో వెదజల్లే పద్ధతిలో వరి వేస్తున్నారు.

24,534 ఎకరాల్లో సాగు

జిల్లాలో ఇప్పటివరకు 15,869 ఎకరాల్లో రైతులు వరినార్లు పోయగా ఇందులో 1,863 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వేశారు. అలాగే, అన్నీ కలిపి 24,534 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వర్షాలు జోరందుకుంటే వరి, పత్తి, మిర్చి, చెరకు, కంది, మినుము, పెసర వంటి పంటల సాగు పనులు ఉధృతమవుతాయి. అలాగే, పత్తి 13,774, చెరకు 255 ఎకరాల్లో, పెసలు 77 ఎకరాల్లో, ఇతర పంటలు 8,316, ఉద్యాన పంటలు 247 ఎకరాల్లో సాగైనట్లు అధికారిక అంచనా.

కొన్ని కంపెనీలపై ఆసక్తి

నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా ఇప్పుడిప్పుడే వర్షాలు ఊపందుకుంటున్నాయి. కొన్ని మండలాల్లో భారీ వర్షం కురుస్తుండడంతో రైతులు పత్తి విత్తేందుకు సిద్ధమవుతున్నారు. కొన్ని కంపెనీల విత్తనాలపైనే ఆసక్తిగా ఉన్న రైతులు దుకాణాల బాట పట్టారు. కానీ వారు కోరుకున్న కంపెనీల విత్తనాలు లభించక ధర ఎంతైనా వెచ్చించేందుకు వెనుకాడకపోగా, దూర ప్రాంతాలకైనా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఏదిఏమైనా మే నెలాఖరు నుంచి వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతుల కల ఇప్పుడు ఫలించడంతో జిల్లావ్యాప్తంగా పంట పొలాలు రైతులు, కూలీలతో కళకళలాడుతున్నాయి.

కొణిజర్లలో అత్యధికం

అన్ని పంటలు కలిపి జిల్లాలో 24,534 ఎకరాల్లో పంటలు సాగవగా.. ఇందులో కొణిజర్ల మండలంలో అత్యధికంగా 4,808 ఎకరాలు ఉన్నాయి. ఈ మండలంలో 4,383 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేయడం విశేషం. అలాగే, ఏన్కూరులో 3,219 ఎకరాల్లో పంటలు సాగైనా మొత్తం పత్తి పంటే ఉంది. వేంసూరు మండలంలో 2,804 ఎకరాల్లో పంటలు సాగు చేస్తే అత్యధికంగా 2,095 ఎకరాల్లో జీలుగు పంట వేశారు. పెనుబల్లిలో 2,257 ఎకరాల్లో పంటలు సాగు కాగా.. ఇందులో 2,173 ఎకరాల్లో జీలుగు సాగైంది.

28నుంచి ఎంసెట్ కౌన్సెలింగ్

- రేపటి నుంచి రిజిస్ట్రేషన్లు
- మొదటి విడత సీట్ల కేటాయింపు జూలై 8న...



ఖమ్మంసహకారనగర్: ఎంసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు గాను కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలుకానుంది. ఇందుకోసం ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈనెల 26వ తేదీ సోమవారం రిజిస్ట్రేషన్ల నమోదు (స్లాట్ బుకింగ్) మొదలు కానుండగా, 28వ తేదీ నుంచి ఆగస్టు 9వ తేదీ వరకు మూడు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఏటా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులే కాక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యార్థులు సైతం ఖమ్మంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరవుతున్నారు. ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందనే భావనతో కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

నచ్చిన కాలేజీ ఎంపికకు అవకాశం

జిల్లాలో ఎనిమిది ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. అయితే, జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్రంలో ఏ కళాశాలనైనా వెబ్ ఆప్షన్ల ద్వారా ఎంచుకునే అవకాశం ఉంది. గత రెండేళ్లుగా రాష్ట్రంలో వివిధ కళాశాలల్లో ప్రవేశాలు, కటాఫ్ ర్యాంకుతో పాటు ఈసారి వివరాలు తెలుసుకునేందుకు http://tseamcet.nic.in వెబ్‌సైట్‌లో లేదా సమీపంలోని కౌన్సెలింగ్ కేంద్రాన్ని సంప్రదించవచ్చు.

మార్కులు తప్పనిసరి

ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈసారి ఇంటర్మీడియట్‌లో కనీస మార్కులు తప్పనిసరిచేశారు. ఇంటర్మీడియట్‌లో ఓసీ, బీసీ విద్యార్థులు ఎంపీసీ(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)లో 45శాతం మార్కులు సాధించి ఉండాలి. అలాగే, ఎస్సీ, ఎస్టీలైతే 40మార్కులు తప్పకుండా సాధించాలనే నిబంధన విధించారు.

కౌన్సెలింగ్ వివరాలు...

మొదటి విడత కౌన్సెలింగ్ కోసం ఈనెల 26నుంచి జూలై 5వ తేదీ వరకు స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉండగా, ఈనెల 28 నుంచి జూలై 6 వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. ఈనెల 28నుంచి జూలై 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే జూలై 8న సీట్లు కేటాయిస్తారు. ఆయా విద్యార్థులు జూలై 12నుంచి 19వ తేదీ వరకు కళాశాలలో ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అలాగే, రెండో విడతకు సంబంధించి జూలై 21నుంచి 22వరకు స్లాట్ బుకింగ్, జూలై 23వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన, జూలై 21నుంచి 24వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదు చేసుకుంటే జూలై 28న సీట్లు కేటాయిస్తారు. ఆయా విద్యార్థులు జూలై 28నుంచి 31వ తేదీ వరకు ఫీజు చెల్లించి రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఇక చివరి దశ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆగస్టు 2న స్లాట్ బుకింగ్, 3వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన, 2నుంచి 4వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఇస్తారు. ఆగస్టు 7న సీట్లు కేటాయింపు ప్రకటిస్తే విద్యార్థులు 9వ తేదీలోగా ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

ఏమేం తీసుకెళ్లాలి?

కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లు తెచ్చుకోవాలి. టీఎస్ ఎంసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, ఆధార్ కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్ మెమో, ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు కలిగిన స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, 01-01-2023 తర్వాత తీసుకున్న ఆదాయ ధృవీకరణ పత్రం, స్లాట్ బుక్ చేసుకున్న రశీదు తీసుకెళ్లాలి. అలాగే, ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ సమర్పించాలనుకునే వారు మాత్రం 2023–24వ సంవత్సరం మీద తీసుకోవాలి.

మధ్యవర్తుల మాటలు నమ్మొద్దు



కౌన్సెలింగ్, వెబ్ ఆప్షన్ల నమోదు సమయంలో మధ్యవర్తుల మాటలు నమ్మొద్దు. కళాశాలను ఎంచుకునే సమయాన ఒకటికి, రెండు సార్లు ఆలోచించాలి. ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా హెల్ప్‌లైన్ సెంటర్‌లో సంప్రదించాలి.

– ఎం.సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్, ఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్

న్యూస్‌రీల్

కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులపై మంత్రి పువ్వాడ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరంలోని మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం సమీక్షించారు. హైదరాబాద్ సచివాలయంలో రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి విజేంద్ర బోయి, ఈఎన్‌సీ రవీందర్‌రావుతో సమావేశమైన ఆయన బ్రిడ్జి నిర్మాణ శైలి, టెండర్లపై చర్చించారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.180 కోట్లు మంజూరు చేసినందున తదుపరి ప్రక్రియపై దృష్టి సారించాలని సూచించారు.

వచ్చేనెల 6 నుండి జీపీ సిబ్బంది సమ్మె

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయడంతో పాటు కార్మికులకు జీఓ 60 ప్రకారం వేతనం చెల్లించాలనే డిమాండ్లతో వచ్చేనెల 6నుండి సమ్మెకు దిగుతున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. ఖమ్మంలో శనివారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకటరాజం, ఆవుల అశోక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీ పర్పస్ కార్మికుల సమస్యలు పరిష్కరించి, నూతన వేతనాలు అమలుచేయాలని ప్రభుత్వానికి అనేక సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈనేపథ్యాన జూలై 5లోగా సమస్యలు పరిష్కరించకుంటే 6నుండి సమ్మె చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కె.నాగరాజు, పిట్టల మల్లయ్య, రామదాసు, పి.మోహన్‌రావు, హసన్, లాలయ్య, లక్క రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ మధుసూదన్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, పక్కన డీఆర్వో శిరీష

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన వచ్చే నెల 1న నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ సూచించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులతో శనివారం ఆయన కలెక్టరేట్‌లో డీఆర్వో శిరీషతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో 163 కేంద్రాలు ఏర్పాటు చేయగా 49,781 మంది పరీక్ష రాయనున్నారని, ఉదయం 10నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుండి 5గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ సూచనల మేరకు నిబంధనలు అమలుచేస్తూ విధులు నిర్వర్తించే ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. ముందుగానే కేంద్రాలను పరిశీలించడంతో పాటు అభ్యర్థులకు బబ్లింగ్ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈసమావేశంలో పరీక్షల విభాగం సూపరింటెండెంట్లు మదన్‌గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అలాగే, స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్య కల్యాణం, పల్లకీసేవ జరిపించారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.

ఏఆర్ ఆర్ఐల బదిలీ

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) విభాగంలో పలువురు ఆర్ఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలో మూడేళ్ల సర్వీస్ పూర్తయిన అధికారులను బదిలీ చేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఐజీపీ కమలహాసన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నుంచి ఆర్ఐలు సింహాచలం శ్రీనివాస్, రవి, తిరుపతి, కొప్పుల సాంబశివరావు బదిలీ కాగా, వారు ఐజీకి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు అందాయి. ఆర్ఐలు ఐదు జిల్లాలను ఆప్షన్‌గా ఇస్తే పోస్టింగ్ కేటాయించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా వానలు

- మధిర మండలంలో అత్యధికంగా 59.4 మి.మీ.
- జిల్లా నగటు వర్షపాతం 17.2 మి.మీ.

ఖమ్మంవ్యవసాయం: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు జిల్లాలోకి గురువారం ప్రవేశించినట్లు అధికారులు వెల్లడించగా.. గురు, శుక్రవారాల్లో జల్లులు కురిశాయి. కానీ శనివారం జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 17.2 మి.మీ.గా నమోదు కాగా, అత్యధికంగా మధిర మండలంలో 59.4 మి.మీ.లుగా నమోదైంది. ఇదిలా ఉండగా శనివారం సాయంత్రం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షాలతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. అయితే, వాతావరణం చల్లబడినా ఉక్కపోత మాత్రం తగ్గలేదు.

మండలాల వారీగా నమోదైన వర్షపాతం

మండలాల్లో శనివారం నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. మధిర మండలంలో 59.4 మి.మీ., సింగరేణిలో 50.8, రఘునాథపాలెంలో 23.8, కామేపల్లిలో 23.6, ఎర్రుపాలెంలో 23.4, కూసుమంచిలో 22.8, తిరుమలాయపాలెంలో 22.6, బోనకల్‌లో 19.2, వేంసూరులో 11.8, కల్లూరులో 11.6, ఖమ్మం రూరల్‌లో 10.4, ఖమ్మం అర్బన్‌లో 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, నేలకొండపల్లి మండలంలో 10.2, తల్లాడలో 10.2, ముదిగొండలో 9.6, ఏన్కూరులో 8.8, కొణిజర్లలో 8.2, సత్తుపల్లిలో 8.2, చింతకానిలో 7.8, వైరాలో 6.6, పెనుబల్లి మండలంలో అత్యల్పంగా 3 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు.

అధిక ధరకు పత్తి విత్తనాల విక్రయం?

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడులో ఓ బ్రాండ్ పత్తి విత్తనాల ప్యాకెట్లను ఎమ్మార్పీకి మించి రూ.1,500 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. రైతులు ఈ విత్తనాల కోసం పోటీ పడుతుండడంతో ధర పెంచినట్లు సమాచారం. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు తల్లంపాడులోని విత్తన దుకాణాల్లో తనిఖీ చేశారు. ఈ విషయమై టాస్క్‌ఫోర్స్ అధికారి, ఏఓ వి.నాగేశ్వరరావు వివరణ కోరగా అధిక ధరకు పత్తి విత్తనాలు అమ్ముతున్నారనే సమాచారంతో తనిఖీ చేశామని తెలిపారు. అయితే, ఎలాంటి అక్రమాలు బయటపడలేదని, డీలర్లు తప్పు చేసినట్లు తేలితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు మంచి విత్తనాల ఎంపికకు అధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.

30న పోడు పట్టాల పంపిణీ

- భద్రాద్రి జిల్లాలో అందజేయనున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: అటవీ భూములను సాగు చేసుకుని బతుకుతున్న గిరి పుత్రులకు భూమిపై హక్కు కల్పించేలా ఈనెల 30వ తేదీ నుంచి పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో పట్టాల పంపిణీని 30వ తేదీన సీఎం కేసీఆర్ ప్రారంభించనుండగా, అదేరోజు భద్రాద్రి జిల్లాలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యం, ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావుతో కలిసి తాను పంపిణీ చేస్తానని పేర్కొన్నారు. గతంలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,51,195 ఎకరాలకు గాను 50,595 మంది గిరిజనులకు పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. దశాబ్దాల పాటు పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ పట్టాల కోసం ఎదురు చూస్తున్న రైతుల కలను సీఎం కేసీఆర్ సాకారం చేశారని, ఈ విషయంలో పోడు రైతుల తరపున సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. ఆ తర్వాత స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

డీసీసీబీలో అక్రమాలపై బిగుస్తున్న ఉచ్చు

- తాజాగా రంగంలోకి దిగిన సీబీసీఐడీ
- గత పాలకవర్గంలో చేపట్టిన పనులపై విచారణ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ ముమ్మరమైంది. బ్యాంకులో జరిగే అక్రమాలపై శాఖాపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవటం సహజమే అయినా, ఈసారి పలువురు చేసిన ఫిర్యాదుతో సీబీసీఐడీ రంగంలోకి దిగింది. అక్రమాలపై పలువురు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సీబీసీఐడీ అధికారులు ఈనెల 19న కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఇప్పటికే బ్యాంకు కేంద్ర కార్యాలయంతో పాటు పలు బ్రాంచ్‌ల్లో పరిశీలించిన అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు.

2013–18 నాటి అక్రమాలపై...

2013–18లో చైర్మన్‌గా మువ్వా విజయబాబు కొనసాగిన డీసీసీబీ పాలకవర్గం హయాంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. వీటిపై బ్యాంకు యంత్రాంగం, ప్రస్తుత పాలకవర్గం వివిధ స్థాయిల్లో శాఖాపరమైన విచారణ జరిపిస్తూనే పోలీసులకూ ఫిర్యాదు చేశాయి. ఇదేక్రమాన వి.శ్రీనివాసరావు, ఎస్.కే.యాకూబ్, గోవిందరావు, రామోజీ ఇటీవల నేరుగా హైదరాబాద్‌లో సీబీసీఐడీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. లాకర్లు, సోలార్ యూపీఎస్‌ల కొనుగోలు, బ్రాంచ్‌ల ఆధునికీకరణ పనులు, ఆస్పత్రి నిర్మాణం తదితర వ్యవహారాల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. ఆనాటి సీఈఓ, అప్పటి చైర్మన్ మువ్వా విజయ్ బాబు కనుసన్నల్లోనే ఇదంతా జరిగిందని ఫిర్యాదులో పేర్కొనగా సీబీసీఐడీ అధికారులు ఖమ్మంలోని ప్రధాన కార్యాలయంలో విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే కొనుగోళ్లకు సంబంధించి బిల్లులు, రికార్డులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నా రు. కాగా, అదే పాలకవర్గం హయాంలో తప్పుడు ధృవీకరణ పత్రాలతో కోట్లాది రూపాయల మార్ట్‌గేజ్ రుణాలు ఇచ్చిన విషయంలో శాఖాపరమైన విచారణ జరుగుతోంది. ఈ వ్యవహారంలో పోలీసులు నమోదు చేసిన కేసును కూడా సీబీసీఐడీ దర్యాప్తు చేస్తోంది.

నేటి నుంచి ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ

ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ(ఫస్ట్ లెవల్ చెకప్)ను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ తెలిపారు. ఇందుకోసం శనివారం సాయంత్రం నుంచే జెడ్పీ ఆవరణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. – ఖమ్మం సహకారనగర్



జెడ్పీ ఆవరణలో బందోబస్తు

క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న 'బీఎస్ఆర్' ఆభరణాల ప్రదర్శన



ఆభరణాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న మహిళా కార్పొరేటర్లు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం వైరా రోడ్డులోని హోటల్ గ్రాండ్ గాయత్రిలో ఏర్పాటుచేసిన విజయవాడ బీఎస్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. కేఎంసీ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, మహిళా కార్పొరేటర్లతో కలిసి బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఈ ప్రదర్శనను ప్రారంభించగా బీఎస్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ బి.రోహిత్‌రెడ్డి మాట్లాడారు. ఆదివారం కూడా కొనసాగే ప్రదర్శనలో డైమండ్, పోల్కీ, విక్టోరియల్ జ్యూయెలరీ అందుబాటులో ఉంటాయని తెలిపారు. క్యారెట్ వజ్రం రూ.54 వేల నుండి ప్రారంభమవుతుండగా, మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు, బంగారు ఆభరణాల కొనుగోలుపై 3 నుండి 9 శాతం వరకు వీఏ తగ్గింపు, మేకింగ్ చార్జీలపై 50 శాతం తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, పోల్కీ జ్యూయెలరీ కొనుగోలుపై వీఏ, మేకింగ్ చార్జీలు ఉండవని ఆయన తెలిపారు.

రూ.2.40కోట్లతో ఏన్కూర్ లిఫ్ట్ పునరుద్ధరణ

ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఏన్కూరు ఎత్తిపోతల పథకాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. వెయ్యి ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో 1999లో ఈ పథకాన్ని నిర్మించగా, పంపుసెట్లు, ప్యానెల్ మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలతో లక్ష్యం నెరవేరడం లేదని రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. దీంతో విషయాన్ని సీఎం కేసీఆర్‌కు వివరించగా రూ.2.40 కోట్లు కేటాయించేందుకు అంగీకరించారని తెలిపారు. లిఫ్ట్‌ను మరమ్మతు చేయించడంతో పాటు మరో 300 ఎకరాలకు అదనంగా సాగునీరు ఇచ్చేలా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఎంపీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎస్ ఆర్ఈఆర్ఏ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎన్.సత్యనారాయణను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సన్మానించారు. హైదరాబాద్‌లో శనివారం ఆయనను మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాతతో పాటు కలిసిన ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అలాగే, తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సత్తుపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రచురించిన నివేదికను అందజేశారు.

హోంమంత్రితో భేటీ

సత్తుపల్లి నియోజకవర్గంలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరుల్లో షాదీఖానాల శంకుస్థాపనకు రావాలని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో మంత్రిని కలిసి షాదీఖానాల పనులు, నిధుల మంజూరుపై చర్చించారు.

టీఎన్జీవోస్ కార్యాలయాల ఏర్పాటుకు వినతి

ఖమ్మంసహకారనగర్: జిల్లాల్లో నిర్మించిన కలెక్టరేట్ల సముదాయాల్లో టీఎన్జీవోస్ కార్యాలయాలకు గది కేటాయించేలా కృషి చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ కోరారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్లలో గది ఇప్పించేలా సీఎస్ ద్వారా కలెక్టర్లకు ఆదేశాలు ఇప్పించాలని సంఘం రాష్ట్ర బాధ్యులను కోరారు. అలాగే, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు, 317 జీఓ ద్వారా బదిలీ అయిన వారికి సొంత జిల్లాల్లో పోస్టింగ్ ఇప్పించేలా చూడాలని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల రాజేందర్, మారం జగదీశ్‌తోపాటు సాగర్, నందగిరి శ్రీను, జీఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంపై విచారణ చేపట్టిన ఏసీపీ

రఘునాథపాలెం: మండలంలోని వీవీ.పాలెంలో స్థల వివాదంపై ఖమ్మం సీసీఎస్ ఏసీపీ రవి శనివారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన తేజావత్ దుర్గమ్మ నివాసం ఉంటున్న ఇంటి గోడను బంధువులు, గ్రామానికి చెందిన 28 మంది గత నెల 17న రాత్రి వచ్చి దౌర్జన్యంగా కూల్చివేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా స్పందన లేకపోవడంతో ఈ నెల 9వ తేదీ మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. మహిళా కమిషన్ ఆదేశాలతో విచారణాధికారిగా సీసీఎస్ ఏసీపీ రవిని సీపీ విష్ణు ఎస్.వారియర్ నియమించారు. ఆయన గ్రామంలో దుర్గమ్మతో పాటు పలువురితో మాట్లాడి వివరాలు నమోదు చేశారు. సీసీఎస్ ఏఎస్సై సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో టోకరా

- రూ.కోటిన్నరకు పైగా వసూలు చేసిన మహిళ
- 40 రోజులుగా అందుబాటులో లేని వైనం
- లబోదిబోమంటున్న బాధితులు



వైరాలో తాళం వేసి ఉన్న జ్యోతి ఇల్లు, (ఇన్‌సెట్) డబ్బు వసూలు చేసిన పత్తిపాటి జ్యోతి

వైరా/వైరారూరల్: గురుకుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో అటెండర్‌గా పనిచేస్తున్న మహిళ అడ్డదారి తొక్కింది. అదే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి పలువురిని నమ్మించి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల చొప్పున రూ.కోటిన్నరకు పైగా వసూలు చేసి ఉడాయించింది. దీంతో బాధితులు లబోదిబోమంటూ న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. బాధితులు, పాఠశాల సిబ్బంది ఇచ్చిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

ఒకరి ద్వారా ఒకరికి..

ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు రూ.3 లక్షలు చెల్లిస్తే రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉండదని.. నేరుగా ప్రభుత్వ కొలువులో చేరొచ్చని జ్యోతి నమ్మించినట్లు సమాచారం. ఒకరి నుంచి ఒకరికి విషయం పాకడంతో పలువురు ఆమెకు డబ్బు చెల్లించారు. వైరాలో నివాసం ఉంటున్న ఎం.కృష్ణ ఉద్యోగం కోసం హనుమాన్‌బజార్‌లో నివాసం ఉన్నప్పుడు జ్యోతికి రూ.1.50 లక్షలు ఇవ్వడమే కాక తన ద్వారా ముసలిమడుగుకు చెందిన మరో వ్యక్తి సైతం నగదు చెల్లించాడు. అలాగే, వైరా మండలం గౌండ్లపాలెంకు చెందిన ఎం.చందు, కొణిజర్ల మండలం చిన్నమునగాల, పెద్దమునగాల, బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి, కలకోట, ఏన్కూరు మండలం టీఏల్‌పేటకు చెందిన పలువురు డబ్బు సమర్పించారు. ఆ తర్వాత ఆమె సొంతింటికి తాళం ఉండడం, పాఠశాల విధులకు గైర్హాజరవుతుండడమే కాక సెల్‌ఫోన్ స్విచాఫ్ వస్తోంది. దీంతో ఆమె ఉడాయించినట్లు బాధితులు గుర్తించారు. ఈ విషయమై బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సుశీలను వివరణ అడగగా జ్యోతి మే 3వ తేదీ నుంచి పాఠశాలకు రావడం లేదని, ఆమె నుంచి సమాచారం లేకపోగా ఫోన్ చేసినా స్విచాఫ్ వస్తోందని తెలిపారు.

బంగారం తాకట్టు పెట్టి..

రూ.3 లక్షలు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తానని జ్యోతి నమ్మబలికింది. మొదటి విడతగా రూ.1.50 లక్షలు బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి ఇచ్చా. గతేడాది డిసెంబర్‌లో డబ్బు ఇవ్వగా నెల తర్వాత అడిగితే జూన్‌లో ఉద్యోగం వస్తుందని చెప్పింది. నెల రోజులుగా ఆమె ఫోన్ స్విచాఫ్ అయింది. పోలీసులకు ఫిర్యాదు చేద్దామంటే మధ్యవర్తి రెండు రోజులు ఆగమన్నాడు.

– ఎం.శ్రీనివాస్, బాధితుడి తండ్రి, గౌండ్లపాలెం, వైరా మండలం

బీసీ సంక్షేమ శాఖలో ఉద్యోగాల పేరిట..

వైరాకు చెందిన పత్తిపాటి జ్యోతి (బీబీ) మండలంలోని రెబ్బవరం బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో నాలుగేళ్లుగా అటెండర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని బీసీ వెల్ఫేర్ శాఖలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పరిచయం చేసుకుని ఉద్యోగాలు ఇప్పించే పథకాన్ని రచించింది. పలువురిని కలిసి తొలుత ఔట్ సోర్సింగ్ ఉద్యోగమే అయినా ఆతర్వాత రెగ్యులర్ అవుతుందని నమ్మబలికింది. ఈమేరకు జిల్లాలో వైరా, కొణిజర్ల, మధిర, బోనకల్, ఎర్రుపాలెం, ఏన్కూరు, తల్లాడ మండలాల పరిధిలో వంద మంది నుంచి రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలకు పైగా వసూలు చేసింది. ఈ క్రమంలో పలువురిని నమ్మించేలా రూ.1.50 లక్షల చొప్పున ప్రామిసరీ నోట్ కూడా రాసి ఇవ్వడం గమనార్హం. అలా వసూలు చేసిన సుమారు రూ.1.50 కోట్ల నగదుతో పరారైంది. ఆ సయయాన వైరాలోనే బ్రాహ్మణపల్లి, శాంతినగర్, పాత బస్టాండ్ సెంటర్, హనుమాన్‌బజార్ ప్రాంతాల్లో ఇళ్లు కిరాయికి తీసుకొని వారం నుంచి పది రోజుల పాటే ఉంటూ నగదు వసూలు చేసింది. అనంతరం ఇళ్లలోనూ లేక పని చేస్తున్న రెబ్బవరం బీసీ గురుకుల పాఠశాలకు గత నెల 3వ తేదీ నుంచి రావడం లేదని తెలియడంతో ఆమె ఉడాయించిన విషయం వెలుగులోకి వచ్చింది.



బాధితులకు జ్యోతి రాసి ఇచ్చిన ప్రామిసరీ నోటు

ఫిర్యాదులు ఏమీ రాలేదు..

ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన విషయమై మా దృష్టికి వచ్చింది. కానీ బాధితుల్లో ఎవరు కూడా ఇప్పటి వరకు ఫిర్యాదు చేయలేదు. ఎవరైనా ముందుకొచ్చి ఫిర్యాదు ఇస్తే విచారణ చేపట్టి ఆమెను అదుపులోకి తీసుకుంటాం. నిరుద్యోగులు ఎవరి మాయమాటలు నమ్మి మోసపోవద్దు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే మాకు సమాచారం ఇవ్వాలి.

– తాటిపాముల సురేశ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, వైరా

విద్యుదుత్పత్తిలో దేశానికే ఆదర్శం

టీఎస్ జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు



ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే వనమా

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని టీఎస్ జెన్‌కో, ట్రాన్స్ కో సీఎండీ డి.ప్రభాకర్ రావు అన్నారు. పాల్వంచ కేటీపీఎస్‌లో రూ. 8.50 కోట్లతో నిర్మించిన జెన్‌కో ట్రైనింగ్ సెంటర్, సిమిలేటర్, హాస్టల్ భవనాలను, కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్‌ను స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్ ఉత్పత్తిలో గణనీయమైన అభివృద్ధి సాధించామని చెప్పారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా గొప్ప విషయమన్నారు. వివిధ రాష్ట్రాల వారు సైతం మన ప్రగతిని సమీక్షిస్తున్నారని అన్నారు. గతంలో 7,778 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉండగా పెరుగుతున్న అవసరాలను తీరుస్తూ మిగులు విద్యుత్ దిశగా కృషి చేసి ప్రస్తుతం 18వేల మెగావాట్లకు చేరుకోగలిగామని వివరించారు. సీఎం కేసీఆర్ సహకారం, ఉద్యోగుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని చెప్పారు. జెన్‌కోలో పనిచేసే ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా అన్ని వసతులతో కూడిన ట్రైనింగ్ సెంటర్ నిర్మించామని, రోజుకు 100 మంది చొప్పున శిక్షణ తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. వైటీపీఎస్ కర్మాగారం పనులు శరవేగంగా సాగుతున్నాయని, బొగ్గు కొరత లేదని అన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జగత్ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ టీఆర్‌కే.రావు, డైరెక్టర్లు లక్ష్మయ్య, అజయ్, సచ్చిదానందం, వెంకటరాజం, టెక్నికల్ సీఎండీ హనుమాన్, ఓఎస్డీ వినోద్‌కుమార్, సీఈలు ఎం.ప్రభాకర్ రావు, పి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసబాబు, నారాయణ, శ్రీనివాస్, ఎస్‌పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ జంగయ్య, సీఐ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

మిశ్రమ, జన్యువైద్యానికి మూలకేంద్రం భారత్

బీర్బల్ సాహానీ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త నీరజ్‌రాయ్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నీరజ్‌రాయ్, పక్కన ప్రొఫెసర్లు

ఖమ్మం సహకారనగర్: భారతదేశం మిశ్రమ, జన్యు వైద్యానికి మూలకేంద్రమని లక్నోలోని బీర్బల్ సాహానీ ఇన్‌స్టిట్యూట్ ప్యాలియో సైన్సెస్ శాస్త్రవేత్త డాక్టర్ నీరజ్‌రాయ్ వెల్లడించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో చరిత్ర, జంతుశాస్త్రం, మైక్రోబయాలజీ విభాగాల ఆధ్వర్యాన శనివారం 'పురా జన్యుశాస్త్రం' అంశంపై అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా నీరజ్‌రాయ్ మాట్లాడుతూ ఆఫ్రికా, తూర్పు ఆసియా దేశాల నుంచి ప్రాచీన కాలంలో మానవులు ఖండాంతరాల్లోకి వలస వచ్చి నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఆసియా, యూరోప్, ఆఫ్రికా దేశాల నుంచి భారత్‌లోకి పార్సీలు, జురాస్ట్రియన్లు, యూరోపియన్లు, నీగ్రోల వలసలతో ఇక్కడ మిశ్రమ జన్యు వైవిధ్యం ఏర్పడిందని తెలిపారు. అనంతరం పలు యూనివర్సిటీల ప్రొఫెసర్లు డాక్టర్ పసుపులేటి నాగార్జున, డాక్టర్ మానస రాఘవన్ మాట్లాడారు. తొలుత కళాశాల స్థలదాత గెంటెల నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్, అధ్యాపకులు, ఉద్యోగులు జాన్‌మిల్టన్, హెచ్.శ్రీనివాసులు, నాగూర్, సునంద, అనితకుమారి, డాక్టర్ సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో పది మందికి గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన రాజశేఖర్

నేలకొండపల్లి: మండలంలో కుక్కల స్వైరవిహారం కారణంగా పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని రాజేశ్వరపురంలో శనివారం కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ రహదారుల వెంట వచ్చివెళ్లే వారిని గాయపరిచాయి. ఈ ఘటనలో ఇంటి ఎదుట గేదె పాలు తీస్తున్న ఎం.పద్మ, లాలుపతి, భద్రకాళి, శ్రీశైలం, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, సాయి తదితరులు గాయపడ్డారు. వారు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించుకుని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం వెళ్లారు.

హెచ్‌ఎం తీరుపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న డీఈఓ, అధికారులు

మధిర: దెందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నారాయణదాసు వ్యవహారశైలిపై ఆరోపణలు రావడంతో శనివారం డీఈఓ సోమశేఖరశర్మ, తహసీల్దార్ జి.కృష్ణ విచారణ చేపట్టారు. పాఠశాలలో దళిత విద్యార్థులపై వివక్ష చూపిస్తున్నట్లు స్థానికులు ఆరోపించగా, చేపట్టిన అధికారులు విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. అలాగే, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బాధ్యతలు సాదు సమాధానంకు అప్పగించారు. ఆతర్వాత దెందుకూరులోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు – మన బడి పనులను డీఈఓ శర్మ తనిఖీ చేశారు. ఎంఈఓ ప్రభాకర్, సర్పంచ్ కోట విజయశాంతి, హరిజనవాడ పీఎస్ హెచ్‌ఎం ఎ.వినోద్‌రావు, ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌తో పాటు కోట వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి డీపీఆర్‌ఓ కుటుంబానికి పలువురి పరామర్శ



సరస్వతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీహెచ్ శ్రీనివాసరావు, తదితరులు

కల్లూరు: భద్రాద్రి కొత్తగూడెం డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాసరావు తల్లి సరస్వతి ఇటీవల మరణించగా శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామమైన కల్లూరు అంబేద్కర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించడంతో పాటు శ్రీనివాసరావు, కుటుంబీకులను పరామర్శించారు. రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు, భద్రాద్రి డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, డీసీఓ వెంకటేశ్వర్లు, సంక్షేమ శాఖ అధికారి సబిత, డీఆర్‌ఓ అశోక్ చక్రవర్తితో పాటు వివిధ పార్టీల నాయకులు, అధికారులు సంభాని చంద్రశేఖర్, నాగా సీతారాములు, డాక్టర్ లక్కినేని రఘు, రవికుమార్, రావిరాల రాంబాబు, గడల లక్ష్మణరావు, వలసాల వీరభద్రం, ఊడల మధుకర్, ఎం.డీ.మౌలాలి, పి.సత్యవాణి, షేక్ జానీమియా, పాలంకి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేశారని ఇంటిపై దాడి

ఇరువర్గాల్లో ముగ్గురికి గాయాలు



గాయపడిన జయరామదుర్గ

వైరారూరల్: పోలీసులకు ఫిర్యాదు చేశారనే కోపంతో మండలంలోని గొల్లపూడిలో శనివారం ఓ ఇంటిపై ప్రత్యర్థులు దాడి చేశారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన బోస్ ఇంటి పెరడులోని 12 ఎకరాలకు చెందిన వరిగడ్డి వామి రెండు రోజుల కిందట కాలిపోయింది. ఈ ఘటనపై ఆయన వైరా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే, బోస్‌కు ఇంటి పక్కన ఉండే ఎరుకుల శాంతి, రమేశ్ దంపతులకు మధ్య కొంతకాలంగా గొడవలున్నాయి. అయితే, పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యాన శాంతి కలకోటకు చెందిన తన బంధువులను పిలిపించడంతో వారు శాంతితో కలిసి గడ్డపలుగు, కర్రలు, రాళ్లతో బోస్ ఇంటిపై దాడి చేశారు. ఘటనలో బోసు భార్య జయరామదుర్గ గాయపడగా అడ్డుకునేందుకు యత్నించిన మహబూబ్ సాహెబ్‌పైనా దాడి చేయడంతో ఇద్దరి తలలు పగిలాయి. అలాగే, కలకోటకు చెందిన ఇటుకల సాంబయ్య కాలికి కూడా గాయమైంది. ఈ ఘటనతో గొల్లపూడిలో గంటల పాటు ఉద్రిక్తత నెలకొంది. ఆ సమయాన పొలానికి వెళ్లిన బోస్ తన భార్యతో కలిసి వైరా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత శాంతి కుటుంబీకులు కూడా మరో ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు తొమ్మిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మధిర: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి (50) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధిర – తొండలగోపవరం రైల్వేస్టేషన్ల మధ్య శనివారం హిమసాగర్ ఎక్స్‌ప్రెస్ కింద పడి శనివారం రాత్రి సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మునుగోటి నరసింహారావు, శివ సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 99636 41484 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ..

తెగిపడిన యువకుడి కాలు



ఘటనాస్థలంలో సోయిల్

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు వద్ద ఖమ్మం–ఇల్లెందు రహదారిపై ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనం నడుపుతున్న యువకుడి కాలు తెగిపడింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం బీకే బజార్‌కు చెందిన మహ్మద్ సోయల్ ఓ యువతితో కలిసి శనివారం ద్విచక్ర వాహనంపై బూడిదంపాడు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమాన ఇల్లెందు వైపు నుంచి ఖమ్మం వస్తున్న లారీ వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా సోయల్ ఓ కాలు మోకాలు కింది భాగంలో తెగిపడడంతో పాటు యువతికి గాయాలయ్యాయి. వారిని ఖమ్మం ఆస్పత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



చెన్నారావు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ద్విచక్ర వాహనం ఢీకొనటంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్తుపల్లిలోని వేంసూరు రోడ్డులో ఈనెల 22న బుగ్గపాడుకు చెందిన ఇన్సూరెన్స్ ఏజెంట్ పానుగంటి చెన్నారావు(42) రహదారి దాటుతుండగా ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య నాగమణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి ఎస్సై బి.రాము శనివారం తెలిపారు.

ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్...

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 8వ డివిజన్ గోపాలపురానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గోపాలపురానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బానోత్ సైదులు (45) శుక్రవారం అల్లీపురంలో పనులకు వెళ్లి గోపాలపురం కాల్వకట్ట పైనుంచి వస్తున్నాడు. ఎదురుగా వచ్చిన గేదెలను తప్పించే క్రమాన పక్కనే ఉన్న రాయి ఎక్కడంతో సైదులు ఎగిరి కింద పడ్డాడు. ఇంతలోనే ట్రాక్టర్ టైర్ ఆయనపైకి ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స అందించి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి, ఎస్ఐ శ్రావణ్ తెలిపారు. కాగా, బానోతు సైదులు భార్య, ఇద్దరు కుమారులను కార్పొరేటర్ లకావత్ సైదులు తదితరులు పరామర్శించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు..



నాగుల్‌మీరా (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురంలో దాబా వద్ద శనివారం రాత్రి ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఎస్‌కే నాగుల్‌మీరా (24) అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యక్తిగత పనిపై ఖమ్మం వెళ్లిన నాగుల్‌మీరా తిరిగి వస్తుండగా దాబా వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన నాగుల్‌మీరా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఖమ్మం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ రవూఫ్ తెలిపారు. కాగా, చేతికందిన ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో నాగుల్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కంటి నిండా నిద్ర కరువు



40 ఏళ్లు పైబడిన వారిని వేధిస్తున్న నిద్ర లేమి

- ఏజ్ వెల్ ఫౌండేషన్ అధ్యయనంలో వెల్లడి
- 5 వేల మందిపై సర్వే
- కనీసం 6 గంటలు నిద్ర పోలేకపోతున్నట్టు 70 శాతం మంది వెల్లడి
- నిద్ర లేమితో బాధపడుతున్న వారిలో పురుషులే అధికం

సాక్షి, అమరావతి: మారిన జీవన విధానాలు, చుట్టుముడుతున్న ఆర్థిక, కుటుంబ సమస్యల నడుమ మధ్య వయస్కులు, వృద్ధుల్లో కంటి నిండా నిద్ర కరవు అవుతోంది. ముఖ్యంగా మధ్య వయస్కులు పగలంతా కష్టం చేసి రాత్రి అయ్యాక కంటి నిండా నిద్రపోవడం ఒక కలగా మారుతోంది. ఏజ్‌వెల్ ఫౌండేషన్ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 40 నుంచి 64 ఏళ్లు, 65 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇలా రెండు వర్గాలుగా మే నెలలో దేశవ్యాప్తంగా 5 వేల మంది నుంచి ఫౌండేషన్ వివరాలు సేకరించింది. వీరిలో 40 నుంచి 64 ఏళ్ల వారు 2245 (పురుషులు 1102, మహిళలు 143)మంది, 65 ఏళ్లు పైబడిన వారు 2,755 (పురుషులు 1,336, మహిళలు 1,419) మంది ఉన్నారు.

6 గంటలు కూడా నిద్రపోలేకున్నాం

70 శాతం మంది రోజులో కనీసం ఆరు గంటలు కూడా కంటి నిండా నిద్ర పోలేకపోతున్నట్లు ఈ సర్వేలో వెల్లడైంది. 24 శాతం మంది మాత్రం 7 నుంచి 8 గంటలు, 6 శాతం మంది 8 గంటలకు పైగా నిద్రపోతున్నట్టు తెలిపారు. మధ్య వయసుల్లో 60 శాతం ఆరు గంటలలోపు, 31 శాతం 7 నుంచి 8 గంటలు, 9 శాతం మంది 8 గంటలకు పైగా నిద్రపోతున్నామన్నారు. అదే వృద్ధుల్లో 78 శాతం మంది ఆరు గంటల్లోపు, 19 శాతం మంది 7 నుంచి 8 గంటలు, 3 శాతం మంది 8 గంటలకు పైగా నిద్ర పోతున్నట్టు వెల్లడైంది.

ఆర్థిక ఇబ్బందులు ప్రధాన కారణం

నిద్ర లేమికి ప్రధాన కారణం ఆర్థిక పరమైన అంశాలేనని సర్వేలో వెల్లడైంది. ఆ తర్వాత కుటుంబ సభ్యుల మధ్య సయోధ్య లేకపోవడం, ఇతర కలహాలు కారణమని పేర్కొంది. యాంత్రిక జీవనం, మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు, మద్యం సేవించడం, ఇతర సమస్యలతో సరైన నిద్ర ఉండటంలేదని కూడా ఫౌండేషన్ తెలిపింది. వయోభారం రీత్యా చుట్టుముట్టిన ఆరోగ్య సమస్యలు, ఒంటరి జీవనం నిద్రలేమికి కారణంగా వృద్ధులు పేర్కొన్నారు.

ఇలా చేయండి.. నిద్ర పడుతుంది

సర్వేలో భాగంగా నిద్ర లేమి సమస్య నివారణకు పలు సలహాలు, సూచనలు కూడా ఫౌండేషన్ తెలియజేసింది. అవి..

- నిద్రకు ఉపక్రమించే 4 గంటల ముందు నుంచి కాఫీ, టీలు తాగకూడదు. ధూమపానం, మద్యపానం చేయకూడదు. వేడి పాలను తాగాలి
- ఆందోళన, ఒత్తిడి, నిరాశ నిద్రకు పెద్ద అవరోధం. వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకోవాలి
- పగటిపూట నిద్ర మానుకోవాలి
- టీవీ, సెల్ ఫోన్ చూడకూడదు
- పడక గదిలో స్లీప్ ఫ్రెండ్లీ వాతావరణం ఉండేలా చూసుకోవాలి

పురుషులే అధికం

నిద్రలేమితో సతమతం అవుతున్న వారిలో పురుషులే అధికం. పురుషుల్లో 81 శాతం మంది కనీసం ఆరు గంటలు కూడా నిద్రపోలేకపోతున్నామని వెల్లడించారు. అదే మహిళల విషయానికి వస్తే 60 శాతం మంది ఆరు గంటలలోపు నిద్రపోతున్నామని చెప్పారు. మరో 15% మంది పురుషులు, 32% మంది మహిళలు 7 నుంచి 8 గంటలు, 4% పురుషులు, 8 శాతం మహిళలు 8 గంటలకు పైగా నిద్రపోతున్నట్టు తెలిపారు. సర్వేలో పాల్గొన్న మొత్తం వ్యక్తుల్లో 55.08% మంది ప్రస్తుతం నిద్ర విధానంతో అసంతృప్తిగా ఉన్నామని తెలిపారు.



చిక్కిన చిరుత

- తల్లి చిరుతను పట్టుకునేందుకు బోను ఏర్పాటు
- నడక మార్గంలో యథావిధిగా భక్తులకు అనుమతి
- అలిపిరి–తిరుమల మధ్య ఫెన్సింగ్ ఏర్పాటు వీలుకాదు
- టీటీడీ ఈవో ధర్మారెడ్డి



తిరుమల నడక దారిలో పట్టుబడిన చిరుత

తిరుమల: అలిపిరి–తిరుమల మార్గంలో బాలుడిపై దాడికి పాల్పడిన చిరుత అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. శేషాచలం అటవీ ప్రాంతంలోని 7వ మైలు వద్ద రెండు ప్రదేశాల్లో రెండు బోన్లు పెట్టగా.. ఒక దానిలో శుక్రవారం రాత్రి 10.45 గంటలకు చిరుత చిక్కిందని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం ఆ చిరుతను టీటీడీ ఈవో అటవీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గురువారం రాత్రి అలిపిరి నడక మార్గంలో బాలుడిపై చిరుత దాడి చేసిందని తెలియగానే దానిని పట్టుకోవాలని నిర్ణయించామన్నారు. చిరుత వయసు ఏడాదిన్నర ఉంటుందని, అది పిల్లిని తరుముకుంటూ వచ్చి అవగాహన లేక పిల్లాడిని తీసుకెళ్లినట్టుగా గుర్తించామని అన్నారు.

చిరుతలు మనుషులపై దాడి చేయవు

చిన్న చిరుత కావడం వల్ల వేటపై అవగాహన లేక ఈ ఘటన చోటుచేసుకున్నట్టు అటవీ అధికారులు తెలిపారు. చిరుతలు మనుషులపై దాడి చేయవన్నారు. చిరుతను బంధించేందుకు రెండు ప్రాంతాల్లో బోన్లను ఏర్పాటు చేసి 150 ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చామని తెలిపారు. శుక్రవారం రాత్రి 10.45 గంటలకు బోనులో చిరుత పడినట్టు సమాచారం వచ్చిందన్నారు. పట్టుబడిన చిరుతను 50 కిలోమీటర్ల అవతల అటవీ ప్రాంతంలో వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. తల్లి చిరుత కూడా ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు గుర్తించామని, దానిని కూడా పట్టుకుంటామని చెప్పారు. శుక్రవారమే తల్లి చిరుత పట్టుబడేదని.. అయితే తగినంత ఆహారం దొరకడంతో అది రాలేదని గుర్తించామన్నారు. త్వరలోనే దాన్ని పట్టుకుని దూరంగా విడిచి పెట్టి భక్తుల్లో ఉన్న భయాందోళనలు తొలగిస్తామన్నారు.

నడక మార్గంలో వచ్చే భక్తులను ఆపబోం

చిరుత దాడి నేపథ్యంలో అలిపిరి–తిరుమల నడక మార్గాన్ని మూసివేస్తున్నట్టు వస్తున్న ఆరోపణలు అవాస్తవమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్పష్టం చేశారు. శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదన్నారు. రాత్రి 7 నుంచి 10 గంటల వరకు గాలి గోపురం నుంచి నరసింహస్వామి ఆలయం వరకు 200 మంది భక్తులకు ఒక సెక్యూరిటీ గార్డు చొప్పున కేటాయింపు ఒక గుంపుగా పంపుతున్నామని తెలిపారు. నడక మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కొందరు కోరుతున్నారన్నారు. జంతువులు తిరిగే అటవీ ప్రాంతంలో వాటి స్వేచ్ఛకు ఇబ్బంది కలిగించకూడదని, అటవీ శాఖ నిబంధనల మేరకే వ్యవహరించాలని స్పష్టం చేశారు.

తిరుమలలో ఆగస్టు, సెప్టెంబర్ గదుల కోటా 26న విడుదల

తిరుమల: శ్రీవారి భక్తుల సౌకర్యార్థం టీటీడీ షెడ్యూల్ ప్రకారం తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదుల కోటాను విడు దల చేస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన గదుల కోటాను ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతి, తలకోన ప్రాంతాల్లోని గదులను భక్తులు https://tirupatibalaji.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు.

29న శ్రీశైలంలో సహస్ర ఘటాభిషేకం

శ్రీశైలం టెంపుల్: రాష్ట్రం సస్యశ్యామలం కావాలనే సంకల్పంతో ఈ నెల 29న శ్రీశైల మహాక్షేత్రంలో మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లవన్న శనివారం తెలిపారు. తొలి ఏకాదశి రోజున మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకం చేస్తామన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు రుద్రపారాయణ, విరాటపర్వ పారాయణ, వారుణానువాక పారాయణ, కాశక పారాయణ, పంచాక్షరీజపం, రుష్యశృంగ, వరుణ జపాలు చేపడతామన్నారు.

ప్రీమియం రైళ్ల స్థానంలో ‘వందేభారత్’

- శతాబ్ది స్థానంలో ప్రస్తుత చైర్‌కార్ రైళ్ల వినియోగం
- వచ్చే మార్చి నుంచి రానున్న వందేభారత్ స్లీపర్
- రాజధాని స్థానంలో వాటిని నడిపే యోచన



సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వేలో ప్రీమియం కేటగిరీ రైళ్లుగా గుర్తింపు పొంది, దశాబ్దాలుగా విజయవంతంగా నడుస్తున్న శతాబ్ది, రాజధాని రైళ్లు త్వరలో కనుమరుగు కాబోతున్నాయి. కొత్తగా ప్రారంభమై సూపర్ సక్సెస్ అయిన వందేభారత్ రైళ్లను వాటి స్థానంలో నడపాలని రైల్వే శాఖ భావిస్తోంది. ప్రస్తుతం పగటి వేళ నడుస్తున్న చైర్‌కార్ కోచ్‌లతో కూడిన రెగ్యులర్ వందేభారత్ రైళ్లు శతాబ్ది స్థానాన్ని ఆక్రమించనున్నాయి. వచ్చే ఏడాది మార్చిలో అందుబాటులోకి రానున్న వందేభారత్ స్లీపర్ రైళ్లను రాజధాని స్థానంలో నడపాలని ప్లాన్ చేస్తోంది. దీంతో ప్రస్తుతం నడుస్తున్న శతాబ్ది, రాజధాని రైళ్లు దశలవారీగా మాయం కానున్నాయి.

అదే వేగంతో..

దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల మధ్య వందేభారత్ రైళ్లను ప్రారంభిస్తున్నారు. వీలైనంత తొందరలో 400 వందేభారత్ రైళ్లను నడపాలని లక్ష్యంగా పెట్టుకున్న రైల్వే శాఖ వాటి తయారీపై దృష్టి సారించింది. చైర్‌కార్ కోచ్‌లతో ఉన్నందున వీటిని రాత్రి వేళ నడిపే వీలు లేదు. దీంతో ఉదయం నుంచి అర్ధ రాత్రి లోపు గమ్యం చేరి, మళ్లీ సొంత స్టేషన్‌కు తిరిగి వచ్చేలా సమయాలను సెట్ చేశారు. ప్రస్తుతం శతాబ్ది రైళ్లు కూడా ఇదే తరహాలో చైర్‌కార్ కోచ్‌లతో పగటి వేళ నడుస్తున్నాయి. భారత తొలి ప్రధాని నెహ్రూ శతజయంతికి గుర్తుగా శతాబ్ది (వందేళ్లు) పేరుతో 1988లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని ప్రారంభించింది.

వచ్చే మార్చికి స్లీపర్ రైళ్లు..

తక్కువ దూరం ఉన్న ప్రధాన నగరాల మధ్య తిరుగుతున్న వందేభారత్ రైళ్లను దూర ప్రాంతాల మధ్యా ప్రవేశపెట్టాలని రైల్వే నిర్ణయించింది. ఇందుకోసం వందేభారత్ స్లీపర్ కోచ్ రైళ్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో దీనికి సంబంధించిన డిజైన్లు సిద్ధమవుతున్నాయి. వచ్చే మార్చి నాటికి తొలి రైలు పట్టాలెక్కించనున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది. ప్రస్తుతం రాజధాని నగరం ఢిల్లీకి, దేశంలోని ప్రధాన నగరాలకు మధ్య అనుసంధానంగా ఉన్న రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్థానంలో వీటిని నడపాలని భావిస్తోంది. 1969లో ఢిల్లీ–హౌరా మధ్య తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ప్రస్తుతం 18 రాజధాని రైళ్లు తిరుగుతున్నాయి. రాజధానిని తేజస్ రైళ్లుగా మార్చాలని నిర్ణయించి, తేజస్ రాజధాని పేరుతో ఏడు రైళ్లను రైల్వే శాఖ ఇప్పటికే ప్రారంభించింది. తాజాగా వాటి స్థానంలో వందేభారత్ స్లీపర్ కోచ్‌లను నడపాలని భావిస్తోంది.

అత్తను నరికిన అల్లుడు

- అక్కడికక్కడే మృతి చెందిన అత్త
- విజయవాడలో ఘాతుకం



నాగమణి (ఫైల్)

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): అత్తను ఆమె అల్లుడే కత్తితో దారుణంగా నరికి చంపాడు. ఈ ఘటన విజయవాడ కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నైనవరం ఫ్లై ఓవర్‌పై శనివారం రాత్రి చోటుచేసుకుంది. మామను కూడా చంపేందుకు ప్రయత్నించగా.. వేగంగా బైక్ నడిపి తప్పించుకోగలిగాడు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వైఎస్సార్ కాలనీకి చెందిన గోగుల నాగమణి (50), గురుస్వామి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం కాగా, రెండో కుమార్తె లలితను ఏకలవ్యనగర్‌కు చెందిన కుంభా రాజేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంతకాలంగా రాజేశ్, లలిత మధ్య గొడవలు జరగడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. అప్పటి నుంచి లలిత పుట్టింట్లోనే ఉంటోంది. విడాకుల కోసం కోర్టులో దరఖాస్తు చేయగా కేసు చివరి దశలో ఉంది. ఈ క్రమంలో రాజేశ్ తన అత్త, మామలను చంపేందుకు ప్లాన్ చేశాడు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో వైఎస్సార్ కాలనీ నుంచి సాయిరాం థియేటర్ వద్ద ఉంటున్న పెద్ద కుమార్తె ఇంటికి నాగమణి, గురుస్వామి బైక్‌పై బయలుదేరారు. వారి బైక్‌ను ఇంటి నుంచే రాజేశ్ మరో వ్యక్తితో కలిసి మరో బైక్‌పై వెంబడించాడు. నైనవరం ఫ్లై ఓవర్ మధ్యన ఉన్న పోలీస్ అవుట్ పోస్ట్ వద్దకు వచ్చేసరికి బైక్ వెనుక కూర్చున్న రాజేశ్ అత్త నాగమణిపై కత్తితో వేటు వేశాడు. భుజంపై కత్తి వేటుపడగా.. నాగమణి పెద్దగా కేకలు వేస్తూ కిందపడిపోయింది. దీంతో ఆమె మెడపై కత్తితో నరికాడు. అదే సమయంలో బైక్‌పై ఉన్న గురుస్వామి భయంతో వేగంగా అక్కడి నుంచి వెళ్లి తప్పించుకున్నాడు. కాగా, రక్తం మడుగులో పడి ఉన్న నాగమణి కొద్దిసేపు గాయాలతో విలవిల్లాడి ఘటనాస్థలంలోనే మృతిచెందింది.

జిల్లా వార్తలు

అంతరాయం లేకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణా



సర్వే ప్లాన్‌ను పరిశీలిస్తున్న జీఎం షాలెంరాజు

సత్తుపల్లిరూరల్: నిర్దేశిత లక్ష్యం మేరకు అంతరాయం లేకుండా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేపట్టాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెంరాజు ఆదేశించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, ఓవర్ బర్డెన్, రక్షణ చర్యలపై సమీక్షించారు. ఈ మేరకు సర్వే ప్లాన్‌ను పరిశీలించిన జీఎం.. ఉత్పత్తి అయిన బొగ్గును రవాణా చేయటంలో అంతరాయాలు తొలగించాలని, ఓవర్ బర్డెన్ లక్ష్యాలను చేరుకునేలా కాంట్రాక్టర్లతో చర్చించాలని సూచించారు. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ పీఓలు ఎస్.వెంకటాచారి, నర్సింహారావుతో పాటు అధికారులు రమణారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఏఈ సివిల్ రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ సివిల్ (ఇంటర్నల్) పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహిస్తున్నట్లు జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టుల భర్తీకి వంద మంది దరఖాస్తు చేసుకోగా స్క్రూటినీ అనంతరం 94 మందికి హాల్ టికెట్లు జారీ చేశామని తెలిపారు.

జాతీయ ఉషూ టోర్నీకి నలుగురి ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: జాతీయస్థాయి సీనియర్ ఉషూ చాంపియన్‌షిప్ పోటీలకు ఖమ్మానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆర్.రవీందర్, పి.పవిత్రాచారి, యు.అనసీయ, పి.సత్యజిత్‌చారి ఈ నెల 26 నుంచి జూలై 1వ తేదీ వరకు మహారాష్ట్రలోని పుణేలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులను డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.పరిపూర్ణాచారి తదితరులు శనివారం అభినందించారు.

విద్యుత్ అంతరాయంతోనే ఇక్కట్లు

- ‘మిషన్ భగీరథ’లో సమస్యలు వస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- సీఎం కేసీఆర్ ఆదేశాలతో క్షేత్రస్థాయి పరిశీలన
- మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్



ఆసుపాక గ్రామస్తులతో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్

అశ్వారావుపేటరూరల్: వేసవిలో వచ్చిన గాలిదుమారాలతో తరచూ విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం కారణంగా మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నమయ్యాయని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. అయితే, తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలతోపాటు మిషన్ భగీరథ ద్వారా సరఫరాలో ఇబ్బంది ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. అశ్వారావుపేటలోని మిషన్ భగీరథ డివిజన్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల్లోని గ్రామాల్లో సమస్య వచ్చిందని తెలిపారు. దీనికి ప్రధాన కారణం విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ములకల్లిపల్లి మండలంలోని తోగ్గూడెం వద్ద జరిగిన అభివృద్ధి పనుల కారణంగా పైపులైన్లు దెబ్బతినడమేనన్నారు. తరచూ విద్యుత్ నిలిచిపోవడంతో తాగునీటి సరఫరాల్లో జాప్యం ఎదురవుతోందని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 2,400 కి.మీ. మేర పైపులైన్లు ఉన్నాయని ఆయన వెల్లడించారు. 2020లో అశ్వాపురం వద్ద ఉన్న హెవీ వాటర్ ప్లాంట్ నిలిచిపోయినా, మిషన్ భగీరథ ద్వారా సరఫరా ఆగలేదని సీఈ గుర్తు చేశారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని 12 హ్యాబిటేషన్లలో సమస్య ఉన్నట్లు తెలుస్తుండగా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రతిపాదనలు చేస్తామన్నారు. అశ్వారావుపేట తాగునీటి సరఫరా గ్రీన్ జోన్‌లోనే ఉండేదని, కొద్ది రోజులుగా రెడ్ జోన్‌లోకి వచ్చిందని తెలిపారు. ఇలాంటి సమస్యలే ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ ఉండగా.. పది రోజుల్లో సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సీఈ స్పష్టం చేశారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ తిరుమలేశ్, డీఈఈ సలీం, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఏఈలు లక్ష్మి, వంశీ, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, చిన్నంశెట్టి వెంకట నరసింహం పాల్గొన్నారు.

గ్రామాల్లో సీఈ సందర్శన

నియోజకవర్గంలోని అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా తరచూ నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సమస్యను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు రెండు రోజుల కిందట సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం కేసీఆర్.. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన అశ్వారావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండలంలోని నారాయణపురం, పెదవాగు ప్రాజెక్ట్, గుమ్మడవల్లి, నందిపాడు, కుడుములపాడు, నెమలిపేట, పెంచికలపాడు, వడ్డెర రంగాపురం, కోయ రంగాపురం, గాండ్లగూడెం గ్రామాల్లో పర్యటించి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ఆ తర్వాత పెదవాగు ప్రాజెక్ట్ వద్ద ఫ్లోరైడ్ రహిత తాగునీటి ప్రాజెక్టును కూడా పరిశీలించారు. ఈ తాగునీటి పథకానికి మరమ్మతులు చేస్తే దాదాపు 17 గ్రామాలకు మిషన్ భగీరథకు ప్రత్యామ్నాయంగా నీరు అందించే అవకాశం ఉంటుందని స్థానికులు సీఈ దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



గురుకుల పాఠశాలలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: వర్షాకాలం మొదలైన నేపథ్యాన గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఉంటున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ఏపీఓ (జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదులు, స్టోర్‌రూమ్, తాగునీటి ట్యాంక్, బియ్యాన్ని పరిశీలించి మాట్లాడారు. వాతావరణంలో మార్పులతో విద్యార్థినులు అనారోగ్యానికి గురయ్యే అవకాశమున్నందున హెచ్‌ఎం, వార్డెన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యపరీక్షలు చేయించాలని, మెనూ ప్రకారం వేడి ఆహార పదార్థాలనే వడ్డించాలని తెలిపారు. వంటగది, డైనింగ్ హాల్, తాగునీటి వనరుల పరిశుభ్రతపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీ భూములను పరిశీలించిన ఏఐజీఎఫ్



కేటీసీ ఏరియాలో మొక్కలు నాటుతున్న ఏఐజీఎఫ్, అధికారులు

టేకులపల్లి: మండలంలోని సింగరేణి కోయగూడెం ఓపెన్ కాస్ట్ ఏరియాలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ (ఏఐజీఎఫ్) కై లేశ్‌భీంరావు భవార్ శనివారం పర్యటించారు. సింగరేణికి అప్పగించిన అటవీ భూములను పరిశీలించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. అలాగే, ఓసీ వ్యూ పాయింట్ నుంచి గనుల్లో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ చర్యలు, పర్యావరణ నిబంధనల అమలును పరిశీలించాక మొక్కలు నాటారు. సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌తో పాటు అటవీ శాఖ, సింగరేణి అధికారులు సురేంద్ర పాండే, రవిప్రసాద్, ప్రహ్లాద్, సౌరభ్ సుమన్, ధనుంజయరెడ్డి, హరినారాయణ, మహేశ్వర్, శివకుమార్, తావుర్యానాయక్, అప్పయ్య, ముక్తార్ హుస్సేన్ పాల్గొన్నారు.

రంగనాయకుల సేవలు మరువలేనివి

పీడీఎస్‌యూ మాజీ నేతకు పోటు రంగారావు నివాళి



రంగనాయకులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రంగారావు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం పంపింగ్ వెల్‌కు రోడ్డుకు చెందిన పీడీఎస్‌యూ మాజీ నాయకుడు రంగనాయకులు అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు ఆయన మృతదేహం వద్ద శనివారం ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, పీడీఎస్‌యూ నాయకులు నివాళులర్పించారు. అనంతరం రంగారావు మాట్లాడుతూ పీడీఎస్‌యూ పాతతరం నేతల్లో పరిచయం అక్కరలేని రంగనాయకులు ఎక్కడ సభ జరిగినా ముందు నిలిచేవారని, ఆయన రాసిన నినాదాలు ఇంకా గోడలపై కనిపిస్తాయని తెలిపారు. పలు దినపత్రికల్లోనూ సబ్ ఎడిటర్‌గా విధులు నిర్వర్తించిన రంగనాయకులు మృతి బాధాకరమని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో ప్రజాపంథా నాయకులు గోకినపల్లి వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, శివలింగం, ఎన్‌డీ నాయకుడు సాగర్, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి విజయ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్, తరుణ్, గణేష్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఎంపీ వద్దిరాజుకు ‘ఆప్టా’ ఆహ్వానం



ఎంపీ రవిచంద్రతో ఆప్టా ప్రతినిధులు

ఖమ్మంమయూరిసెంటర్: అట్లాంటాలో జరగనున్న సదస్సుకు హాజరుకావాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను అమెరికన్ ప్రోగ్రెసివ్(ఆప్టా) తెలుగు అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు శనివారం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు ఎంపీ రవిచంద్రకు ఆహ్వానం అందజేశారు. సెప్టెంబర్ 1నుంచి 3వరకు జరిగే సదస్సులో పాల్గొనాలని కోరారు. ఆప్టా అధ్యక్షుడు కొట్టే ఉదయభాస్కర్ తరపున మాజీ అధ్యక్షుడు గూడపాటి గోపాల ఆహ్వానపత్రిక అందజేయగా ప్రముఖ వ్యాపారి సుధీర్‌కుమార్, డాక్టర్ సెట్లం రంగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహించే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ కె.ప్రత్యూష తెలిపారు. ఖమ్మం రీజియన్‌లోని గురుకుల కళాశాలల్లో ఫిజిక్స్ నాలుగు, గణితం, జువాలజీ రెండు, తెలుగు, ఇంగ్లిష్, బాటనీ జూనియర్ లెక్చరర్ పోస్టులు ఒక్కొక్కటి ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నా రు. అలాగే, పాఠశాలల్లో గణితం రెండు పోస్టులతో పాటు ఇంగ్లిష్, సైన్స్, సాంఘిక శాస్త్రం, పీటీటీ ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈడీ, పీజీ అర్హతతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు ఈ నెల 29వ తేదీ లోగా ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. అభ్యర్థులకు జూలై 3న ఉదయం 10 గంటలకు డెమో, ఇంటర్వ్యూ ఉంటాయని ఆర్‌సీఓ వివరించారు.

గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు...

ఖమ్మం రీజియన్ పరిధిలోని బీసీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీఓ జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలోని రఘునాథపాలెం ఎస్ఎస్ మూర్తి కళాశాలలో నిర్వహిస్తున్న మహిళా కళాశాల, కొత్తగూడెంలో ఏర్పాటుచేసే పురుషుల గురుకుల కళాశాలలో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు రఘునాథపాలెం కళాశాలలో దరఖాస్తులను ఇవ్వాలని, వివరాలకు 90103 45351, 80194 22103 నంబర్లను సంప్రదించాలని సూచించారు. అలాగే, అలాగే డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాకుల పోస్టులకు తాత్కాలిక పద్ధతిపై భర్తీ చేయనుండగా పీజీ, బీఈడీ, ఎస్‌ఈటీ సెట్, పీహెచ్‌డీ చేసి బోధన అనుభవం ఉన్న వారు అర్హులని తెలిపా రు. అంతేకాకుండా గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోష ల్, బయాలజీ ఉపాధ్యాయ పోస్టులకు ఆసక్తి ఉన్న వారు పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అర్హులు ఈనెల 28లోగా ఖమ్మం కలెక్టర్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని, సమాచారం కోసం 79899 33241 నంబర్‌లో సంప్రదించాలని ఆర్‌సీఓ సూచించారు.